క్లుప్తంగా

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి


ఆదివాసీలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న పోలీసులు

గుండాల: ఏజెన్సీ గ్రామాల్లో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఆదివారం శంబునిగూడెం, శెట్టిపల్లి గ్రామాల్లోని 100 కుటుంబాలకు నిత్యావసర సరుకులు రాబిన్ హుడ్ అనే స్వచ్ఛంద సంస్థ సాయంతో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రజలు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. యువత గంజాయి, మద్యపానం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. గుండాల సీఐ ఎల్.రవీందర్, కొమరారం ఎస్సై నాగుల్ మీరా, గుండాల ఎస్సై సైదా రవూఫ్, పోలీస్ సిబ్బంది, రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఉన్న వినాయకుడి విగ్రహానికి హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు రజిత కిరీటాన్ని విరాళంగా అందించారు. రెండు కేజీల ఆరు వందల గ్రాములు ఉన్న రూ.3.25 లక్షలు విలువ చేసే ఈ రజిత కిరీటంతోపాటు ఆభరణాలను ఆదివారం వినాయకుడిగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ బాధ్యులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి

ములకలపల్లి: రైతులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా బేషరతుగా యూరియా ఇవ్వాలని తెలంగాణా రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపురం గ్రామంలో గొగ్గెల ఆదినారాయణ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఎరువుల కొరత పేరిట అన్నదాతలను యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్లో నిలుచోబెడుతున్నారని ఆరోపించారు. వాసం వెంకటేశ్వర్లు, గొగ్గెల పాపారావు, బత్తుల వెంకటేశ్వర్లు, గొగ్గెల రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధన..


దప్పువాయిద్యాలతో ప్రదర్శనగా వెళ్తున్న ఆదివాసీలు

చంద్రుగొండ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులో ఆదివారం వనసమారాధన నిర్వహించారు. గ్రామశివారులోని కనకగిరి గుట్టల ప్రాంతంలో ఉన్న గ్రామదేవతల వద్దకు ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. దప్పువాయిద్యాలు, నృత్యాలతో ప్రదర్శన నిర్వహించారు. దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, ఆదివాసీ పూజారులు హరిబాబు, పిట్టల నర్సింహారావు, గ్రామపెద్దలు ఈసం రాములు, కొడెం నర్సింహారావు, రాము, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న బాలవెలుగు పాఠశాలకు టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెళ్లి వెంకటేశ్వర్లు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ట్యూబ్‌లైట్లను వితరణగా అందజేశారు. నాయకులు బంగారి పవన్‌కుమార్, ముకేష్ కుమార్, జంగం రాజ్‌కుమార్, రాజేందర్, తిరుపతి, నాగరాజు పాల్గొన్నారు.

సజ్జన్ సమాజ్ యూత్ అధ్యక్షుడిగా ఇమ్రాన్

చంద్రుగొండ: అంతర్జాతీయ సజ్జన్ సమాజ్ మండల అధ్యక్షుడిగా ఎండీ.ఇమ్రాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రతిభ విద్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఏ అభిలాష్ ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. మనిషిలో నైతిక విలువలు పెంపొందించడం, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా వారిని మానసికంగా దృఢంగా చేయడమే సంస్థ లక్ష్యమన్నారు. శాంతియుత సమాజ స్థాపనే సంస్థ లక్ష్యమని ఆయన చెప్పారు. మండల అధ్యక్షుడిగా ఇమ్రాన్‌తోపాటు ఉపాధ్యక్షుడిగా సోమనపల్లి వినయ్, కార్యదర్శిగా ఎస్డీ బషీర్‌పాషా, కోశాధికారిగా ఎండీ.ఒసామా, సభ్యులుగా దేవంద్ర, ఎల్ రమేష్, కిరణ్, ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు ఎండీ.ఖాజాహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

అప్‌డేట్ కష్టాలు తొలగేనా?

- ఆధార్ మార్పుల కోసం ప్రజలు ఇక్కట్లు
- గంటల తరబడి లైన్లో పడిగాపులు
- ఆధార్ క్యాంపుల ఏర్పాటుకు డిమాండ్


మణుగూరులో ఆధార్ క్యాంప్ వద్ద బారులుదీరిన జనం (ఫైల్)

పినపాక: నేటి జీవితంలో ఆధార్ మనిషికి ఎంత అవసరమో అందరికీ తెలిసిందే. బ్యాంకు ఖాతా దగ్గర నుంచి ప్రభుత్వ పథకాలు అమలు వరకు ప్రతీ దానికి ఆధార్ తప్పనిసరి అయింది. డిజిటల్ లావాదేవీలకు కూడా ఆధార్ తప్పనిసరి అయింది. అలాంటి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోడానికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

క్యాంప్ ఏర్పరిచినా తప్పని తిప్పలు..

ఆధార్ కోసం ఆధార్ క్యాంపుల దగ్గర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా మొత్తానికి మూడు రోజుల పాటు ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో జనాలు రావడం, ఆధార్ అప్‌డేట్ కోసం బారులుదీరడంతో కలెక్టర్ మూడు మండలాలకు ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశారు. పినపాక, కరకగూడెం, మణుగూరు మండలాలకు కలిపి మణుగూరులో మూడు రోజులపాటు ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రజలు భారీ సంఖ్యలో లైన్లు కట్టారు. క్యాంపు ఏర్పాటు చేసినప్పటికీ అది మూడు మండలాలకు ఒక్కటే కావడంతో ప్రజలు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రతీ మండలంలో అవసరం..

ప్రతీ మండల పరిధిలో ఓ ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయాల్సి ఉంది. మూడు నుంచి ఐదు రోజుల పాటు క్యాంపులు ఏర్పాటు చేస్తే ప్రజల ఇబ్బందులు తప్పుతాయి. గంటల తరబడి క్యూ లైన్లు, జిల్లా కేంద్రానికి వెళ్లే పరిస్థితి తప్పుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

పంచాయతీలో ఏర్పాటు చేయాలి..



పంచాయతీ పరిధిలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. తద్వారా ఆధార్ అప్‌డేట్ ఇబ్బందులు తప్పుతాయి. సులువుగా అప్‌డేట్ చేసుకోవడానికి వీలవుతుంది. మీసేవ, బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి తప్పుతుంది.

– జంపయ్య, ఎల్సిరెడ్డిపల్లి

ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తాం..



పై అధికారులను సంప్రదించి మండలంలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తాం. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి వీలైనంత త్వరగా మండలంలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తా.

– గోపాలకృష్ణ, పినపాక తహసీల్దార్

ఘనంగా స్నేహితుల దినోత్సవం


మణుగూరురూరల్: ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా స్నేహితుల దినోత్సవ వేడుకలను పెద్దలు, యువత, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, పెద్దలు, యువత చరవాణి ద్వారా.. సోషల్ మీడియా వేదికల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మరికొందరు ఒక చోట చేరి సరదాగా గడిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కూడా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ సభ్యులు ఒకరికొకరు బ్యాండ్స్ కట్టుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మీరాహుస్సేన్ మాట్లాడారు. అనంతరం బాలవెలుగు పాఠశాల విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దండా రాధాకృష్ణ, డాక్టర్ దుస్సా సమ్మయ్య, గాజుల రమేష్, ముత్తంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, కూరాకుల శ్రీనివాసరావు, వి.నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ బి.జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్పీకి శుభాకాంక్షలు..

మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాండ్ల సురేష్, గణేష్‌రెడ్డి, బొజ్జా త్రిమూర్తులు, రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు అశోక్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా శ్రీవాణినికేతన్ పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు వారి మిత్రులు జి.రాజేష్, మోహిని, నవీన్‌రెడ్డిల జ్ఞాపకార్థంగా ఆదివారం మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమూల్ శ్రీనివాస్, చందా మధు, సంపత్, దూపకుంట్ల శ్రీను, పి.సంతోష్, ఎస్.కుమారస్వామి, శ్యామ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న మిత్రులు

దుమ్ముగూడెం: ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. తమ మిత్రులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి స్వీట్స్ తినిపించుకున్నారు. వారి జీవితంలో స్నేహం ఎంత విలువైనదో ఒకరికి ఒకరు పంచుకున్నారు. లింగ, వయస్సు వ్యత్యాసాలు లేకుండా స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

పని చేయని ఆర్వో ప్లాంట్


మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్ ఇదే..

అశ్వారావుపేటరూరల్: ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని అటెండర్స్ కాలనీలో గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఉంది. ఇందులోని ఆర్వో ప్లాంట్ గడిచిన వారం రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు శుద్ధిచేసిన తాగునీరు అందడం లేదు. దీంతో వారు బోరు నీరే తాగాల్సి వస్తోంది. దీనివల్ల విద్యార్థినులు దగ్గు, గొంతు నొప్పితో బాధ పడుతున్నారు. కాగా, వైద్యుల సూచనతో విద్యార్థినులకు బోరు నీళ్లు వేడి వేసి చల్లార్చి అందిస్తున్నారు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి, శుద్ధి చేసిన తాగునీరు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఆదివారం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం భూవాసింగ్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైన మాట వాస్తవమేనని అన్నారు. మరమ్మతులు చేయిస్తున్నామని, రెండు రోజుల్లో తిరిగి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

మణుగూరుటౌన్: ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ నాగమని నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలుర ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు కోర్సుల్లో అడ్మిషన్ల ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ మైనింగ్ ఇంజనీరింగ్‌లలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

బెల్ట్ షాపులను తొలగించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో విచ్చలవిడిగా వెలసిన బెల్ట్ షాపులను తొలగించాలని దళిత ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు అల్లాడి జయరాజు కోరారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే వైన్ షాపుల యజమానులు సిండికేట్‌గా ఏర్పాడి బెల్టు షాపులకు మద్యం పంపిణీ చేస్తున్నారని అన్నారు. తద్వారా అధిక ధరకు విక్రయించి, మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గడిదేసి సాగర్, బర్ల రామకృష్ణ, చీకటి దసింబాబు, హుస్సేన్, శ్యాము, గడిదేసి సాగర్, నాగబాబు, సాయి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో మహాసంపర్క్ అభియాన్‌తో పాటు కేంద్ర పథకాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆదివారం రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ కుంజా ధర్మా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల ముదస్తు ప్రచారంలో భాగంగా బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో పేద ప్రజల కొరకు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల స్టికర్లు, కరపత్రాలతో పట్టణంలో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, చెల్లుబోయిన వెంకన్న, మునిశెట్టి రామ్మోహన్, ముత్యాల చంద్రశేఖర్, దేవరపల్లి వెంకటేశ్వర్లు, ములిశెట్టి నిఖిల్, అన్నం సాయి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో తనిఖీలు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ, ఏపీ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆదివారం స్థానిక ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐ సాంబమూర్తి పర్యవేక్షణలో ఏపీ వైపు నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వస్తున్న వాహనాలను నిలిపివేసి క్షుణంగా తనిఖీలు చేశారు. కాగా, ఏపీ వైపు నుంచి నిషేధిత మత్తుపదార్థాలు, నకిలీ మద్యాన్ని నివారించేందుకు ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

'రేగా' పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కల్లూరి లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆదివారం దశదినకర్మకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరై లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మిట్టగూడెం మాజీ సర్పంచ్ కొర్సా దుర్గారావుకు ఇటీవల ఆపరేషన్ కాగా.. ఆయనను పరామర్శించారు. నెల్లిపాక గ్రామ పంచాయతీలోని టేకులగుట్ట గ్రామానికి చెందిన అమరపురి శ్రీనాథ్‌కు ఇటీవల ఓయూ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎన్నా అశోక్‌కుమార్, సున్నం రాంబాబు, పాయం భద్రయ్య, తాటి పూజిత, గొర్రెముచ్చు వెంకటరమణ, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడి మృతికి నివాళి

ములకలపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు బొర్రా భద్రయ్య మృతదేహానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ నివాళులర్పించారు. ఆదివారం మండల పరిధిలోని వీకే.రామవరం గ్రామంలోని భద్రయ్య ఇంటికి వెళ్లి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రయ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల మహేష్ తదితరులు ఉన్నారు.

కష్టపడిన వారికి పార్టీలో ప్రాధాన్యత


వీరబాబును సన్మానిస్తున్న బీసీ సంఘం నేతలు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ కష్టపడిన వారిని ఎప్పటికీ మరువదని, వారికి తగిన ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. పదవి లభించిన అనంతరం తొలిసారి ఆదివారం మణుగూరులో పర్యటించిన ఆయనకు.. బీసీ సంఘాల నేతలు గురజాల గోపి, బుర్రా సోమేశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజా భవన్ సమీపంలోని బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కష్టపడిన కార్యకర్తగా తనకు గుర్తింపునిచ్చి బీసీ బిడ్డనైన తనకు జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. ఈ సందర్భంగా నేతలు ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో గుండ్ల వెంకటేశ్వర్లు, పెనుగొండ సాంబశివరావు, పాదిల్ల వీరబాబు, రేణుక అక్షర మహిళా మండలి నాయకులు పూనెం సరోజ, షభానా, కోరి శ్యామల, సౌజన్య బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు విస్తృతపరచాలి


ప్రమాణస్వీకారం చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా నూతన కార్యవర్గం..

బూర్గంపాడు: రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సామాజిక సేవలను మరింతగా విస్తృతపరచాలని ఐటీసీ పీఎస్‌పీడీ శైలేంద్రసింగ్ అన్నారు. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా 24వ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం ఐటీసీ కళాభారతిలో ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శైలేంద్రసింగ్ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని అభినందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా నూతన అధ్యక్షుడిగా కునిశెట్టి రాంబాబు, కార్యదర్శిగా చాంద్‌బాషాలు ప్రమాణస్వీకారం చేశారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ గవర్నర్ మహాలక్ష్మి ప్రమాణస్వీకారం చేయించారు. రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షులుగా విద్యావాణి, కార్యదర్శిగా మల్లికార్జున్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

మణుగూరుటౌన్: మండలంలోని కూనవరం పంచాయతీకి చెందిన జిల్లా రవీందర్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపాడు. ఆదివారం హైదరాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరిగిన లాంగ్‌జంప్, వంద మీటర్ల రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో రెండు బంగారు పతకాలు సాధించి విజేతగా నిలిచారు. రెండు బంగారు పతకాలు సాధించిన రవీందర్‌కు స్నేహితులు, క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు. అరవై ఏళ్ల వయస్సులోనూ క్రీడారంగంపై మక్కువతో మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న జిల్లా రవీందర్.. మరెన్నో అవార్డులు, రివార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

సున్నం రాజయ్యకు నివాళి

సీపీఎం దివంగత నేత సున్నం రాజయ్య ఐదో వర్ధంతిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన చిత్రపటాల వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు.


అశ్వారావుపేటరూరల్: రాజయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం: సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, నాయకులు యలమంచి శ్రీనుబాబు, బొల్లి సాయిబాబు, ఖాదర్‌బాబు, కుమ్మరికుంట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: సీపీఎం జిల్లా నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో, మండలంలోని పండువారిగూడెం, నందిపాడు, గుంటిమడుగు, దబ్బతోగు, కోయ రంగాపురం గ్రామాల్లో నివాళులర్పించారు. నాయకులు చిరంజీవి, ముళ్లగిరి గంగారాజు, మడిపల్లి వెంకటేశ్వరరావు, ఏసు, నాగేందర్, రాంబాబు, ఖాసీం, మడకం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పార్టీ సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించగా.. నాయకులు ఎస్.వెంకట్రావు, దామల్ల వెంకన్న, పిట్టల నాగమణి, కోండ్రు గౌరి, తోట పద్మ, సీఐటీయూ నాయకులు బండారి సారిక, కమలమ్మ, ముత్యాలు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతా గుంతలమయం

- ఇసుక లారీలతో సమస్య జటిలం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


దేవరాపల్లి సమీపంలో ధ్వంసమైన రహదారి

చర్ల: చర్లలోని ప్రధాన రహదారులన్నీ గుంతల మయమయ్యాయి. నిత్యం వందలాదిగా తిరుగుతున్న ఇసుక లారీలతో భద్రాచలం-వెంకటాపురం ప్రధాన రహదారి అడుగుకో గుంత చొప్పున అవి కూడా అడుగు అడుగున్నర మేర లోతున ఏర్పడ్డాయి. వర్షాలకు నానిపోయిన రహదార్లు అధిక బరువుతో, అతి వేగంగా ప్రయాణిస్తున్న ఇసుక లారీలు రహదారులను పూర్తిగా కృంగిపోయేలా.. పెద్ద ఎత్తున గుంతలు పడేలా చేస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

చర్ల నుంచి భద్రాచలానికి, చర్ల నుంచి వెంకటాపురానికి వెళ్లే 14వ నంబర్ రాష్ట్రీయ రహదారిపై చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు కల్వర్టులు, వంతెనలు ఉన్న ప్రాంతాల్లోని అప్రోచ్ రోడ్డు ఇసుక లారీల బరువుకు భారీగా కృంగిపోతున్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణిస్తున్న ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు ప్రమాదాలకు గురవుతుండగా.. కార్లు, బస్సులు, టాటా మ్యాజిక్‌ల వంటి వాహనాలు గుంతల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయి.

ప్రమాదాల తీరు ఇలా..

ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల వల్ల రహదారిపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులు, ఆటోలు గుంతల సమీపానికి వచ్చిన సందర్భాల్లో ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. వర్షం కురిసి గుంతల్లో నీళ్లు నిలుస్తున్న సందర్భంలో ద్విచక్రవాహనదారులు నీళ్లల్లో ఉన్న లోతు తెలియక అందులో దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా భద్రాచలం-వెంకటాపురం మార్గంలో ప్రతీ రోజు ఓ ఘటన చోటుచేసుకుంటోంది.

మేం బస్సులు నడపలేం..

ధ్వంసమైన రహదారుల మూలంగా ఆర్టీసీ అద్దె బస్సులు నడిపేందుకు బస్సుల యజమానులు వెనుకడుగు వేస్తున్నారు. వెంకటాపురం-చర్ల మార్గంలో భద్రాచలం ఆర్టీసీ డిపోలో అద్దె ప్రాతిపదికన బస్సులను నడుపుతున్న యజమానులు.. ఆ మార్గంలో నడిపిస్తున్న తమ బస్సులు నిత్యం మరమత్తులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గతంలో తాము తమ బస్సులను ఆ మార్గంలో నడపలేమని ఆర్టీసీ అధికారులకు తెగేసి చెప్పారు. భద్రాచలం డిపో నుంచి వెంకటాపురం వరకు నడిచిన బస్సులను రద్దు చేసి చర్లకు మాత్రమే పరిమితం చేసి నడుపుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకునేనా?

పెద్ద ఎత్తున ఏర్పడిన గుంతల్లో కనీసం కంకరగానీ, వెట్ మిక్స్ గానీ పోసి తాత్కాలికంగా అయినా గుంతలు పూడ్చేందుకు చొరవ చూపడం లేదు. దీంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వెళ్లేంత వరకు అయినా ఇసుక లారీలను నిలిపి వేసి ప్రధాన రహదారికి ఏర్పడిన గుంతలను తాత్కాలికంగా పూడ్చివేయాలని కోరారుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల రాకపోకలకు మార్గం సుగుమం చేయాలని ఏజెన్సీ ప్రజానీకం ముక్తకంఠంతో కోరుతోంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల వల్ల రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం గుంతలను తాత్కాలికంగా అయినా పూడ్చి ప్రమాదాలు జరుగకుండా చూడాలి.

– ఎం.రాజు, తేగడ

ఇసుక లారీలను ఆపాలి



భారీగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లు పూర్తిగా నానిపోయి ఇసుక లారీల బరువుతో మరింత పాడైపోతున్నాయి. రోడ్డు కృంగి పోవడంతో పాటు పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడుతున్నాయి. కనీసం వర్షాలు తగ్గేంత వరకు అయిన ఇసుక లారీలను ఆపి రోడ్డు మరింత ఎక్కువగా ధ్వంసం కాకుండా చూడాలి

– వై.గిరిబాబు, ఆర్ కొత్తగూడెం